మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

విప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలుచేసే ప్రతి పథకంలో మహిళలను భాగస్వాములుగా చేస్తూ మహిళా సాధికారతను విశేషంగా కృషిచేస్తున్నారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు.

స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో పెనుగంచిప్రోలు మండలంలోని 1179 డ్వాక్రా గ్రూపులకు ఆసరా పథకం నాలుగోవిడత కింద ఆదివారం ఆయన రూ.10.45కోట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచి వేల్పుల పద్మకుమారి అధ్యక్షత వహించగా, విప్ ఉదయభాను మాట్లాడుతూ దేశంలోనే మహిళల కోసం అత్యధిక పథకాలను అమలుచేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానికసంస్థల పదవుల్లోనూ 50శాతం రిజర్వేషన్లను కల్పించారని గుర్తుచేశారు. పసుపు-కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలను నిలువునా ముంచిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. సీఎం జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి ఎనిమిది లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. మహిళల్లో ఉండే ఆర్థిక క్రమశిక్షణ వారి కుటుంబాలకు శ్రీరామరక్షగా ఉంటుందని తెలిపారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు 600అబద్ధపు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక హామీలను గాలికొదిలేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలోని 4724 గ్రూపులకు నాలుగు విడతల్లో కలిపి రూ.42.10కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన వీఓఏ, వలంటీర్లను ఘనంగా సత్కరించగా, విప్ ఉదయభాను దంపతులను మండల సమాఖ్య తరుపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత్ విజిత, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండల సమాఖ్య అధ్యక్షులు కాకాని పద్మ, శిరీష, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, పెద్దసంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో డ్వాక్రా మహిళలకు రూ.10.42కోట్లను పంపిణీ చేస్తున్న విప్ సామినేని ఉదయభాను, ఎంపీపీ గాంధీ, నాగమణి, కె.పద్మ, నాయకులు



సభకు హాజరైన డ్వాక్రా మహిళలు



శనగపాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను, నాయకులు

జగనన్నను మరోసారి ఆశీర్వదించాలి

శనగపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం మరింత అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సి ఉందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. మండలంలోని శనగపాడులో రూ.43.80లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. డీఎంఎఫ్ నిధులు రూ.55 లక్షలతో నిర్మించే డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ ఉదయభాను మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పాలన తీసుకురావడం ద్వారా సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెలకొల్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయవాడ ఎంపీగా కేశినేని నాని, పేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, శనగపాడు, వెంగనాయకునిపాలెం సర్పంచులు కీసర సైదులు, భూమన నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షులు బి.రాజారత్నం, ఎంపీడీవో సాయిహర్ష, పీఆర్ ఏఈ సుందరరామయ్య, గ్రామ కార్యదర్శి సునీల్‌కుమార్, నాయకులు క్రీస్తురాజు, సురేష్, చిన్నబాబూరావు, షేక్ దూదా పాల్గొన్నారు.

204 మందికి ఇళ్లపట్టాలు అందజేత



గోపినేనిపాలెం(వత్సవాయి) : లబ్ధిదారులకు సర్వహక్కులతో జగనన్న ఇంటి పట్టాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. మండలంలోని గోపినేనిపాలెంలో ఐదెకరాలల్లో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 204 మందికి లబ్ధిదారులకు ఆదివారం ఆయన పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల మంది అక్కాచెల్లెళ్లమ్మలకు ఇంటి పట్టాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మాత్రమే పేదల కోసం కాలనీల నిర్మాణం జరిగిందన్నారు. పేదలకు సర్వహక్కులతో లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందిస్తున్నట్లు వివరించారు. అంతకుముందు గ్రామ శివారు నుంచి ర్యాలీగా బయలుదేరి, సుందరయ్యకాలనీ నందు నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి బాణావతు శ్రీనివాసరావు, ఎంపీటీసీ హుస్సేనీ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కట్టా శ్రీను, కామినేని రాంబాబు, కోమటి వెంకటేశ్వరరావు, దబ్బాకుపల్లి సర్పంచి కొట్టె నగేష్, భూక్యా రాజానాయక్, కొలుసు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ రాంబాబు బాధ్యతల స్వీకరణ



పెనుగంచిప్రోలు: మండల ఎస్ఐగా పి.రాంబాబు ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన సీహెచ్ కె.దుర్గాప్రసాద్ విజయవాడకు బదిలీకాగా, ఆస్థానంలో మైలవరం నుంచి రాంబాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలలో బోరు ఏర్పాటు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఆదివారం బోరు ఏర్పాటు పనులు చేపట్టారు. బోరు ఏర్పాటు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన సమయంలో నీటిసమస్యను విద్యార్థులు వివరించగా, ఆయన వెంటనే స్పందించి బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రను ఆదేశించారు. దీంతో వెంటనే బోరు ఏర్పాటు పనులు చేపట్టినట్లు చెప్పారు. మున్సిపల్ ఏఈ హనుమంతరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ పి.సాయిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీటీ షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండల కేంద్రం జుజ్జూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీటీ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



గోపినేనిపాలెం(వత్సవాయి) : సామాజిక న్యాయం పాటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలోకి ప్రజలు పెద్దసంఖ్యలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. గోపినేనిపాలెం పంచాయతీలోని 5, 9వ వార్డు సభ్యులు షేక్ రహ్మాన్, గుడేటి వెంకటరత్నంలతోపాటు సపావతు లచ్చునాయక్, పాము యేసయ్య తదితరులు ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఉదయభాను పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూఅంబేడ్కర్ ఆశయాల సాధనకై సామాజికన్యాయం పాటిస్తూ బడుగు బలహీన వర్గాల వారికి పెద్దపీట వేస్తున్న సీఎం జగనన్న పాలన ఆదర్శమన్నారు. అందుకే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీలో చేరికలు భారీగా జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి బాణావతు శ్రీనివాసరావు, ఎంపీటీసీ హుస్సేనీ, సొసైటీ అధ్యక్షులు కట్టా శ్రీను, కామినేని రాంబాబు, కోమటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



నందిగామ: మాజీ ఉపప్రధాని ఎల్‌కె అద్వానీకి భారతరత్న ప్రకటించడంపై నందిగామ బీజేపీ నాయకులు హర్షం వ్యక్తంచేస్తూ ఆదివారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశానికి అద్వానీ చేసిన నిస్వార్థ సేవలను కొనియాడారు. ఆయన సేవలకు కేంద్రం తగిన పురస్కారాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు కేదార్నాథ్‌శర్మ, సీతారామయ్య, వాచస్పతి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నందిగామ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రౌడీషీటర్లు వివాదాలకు దూరంగా సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా హనీష్ మాట్లాడుతూ ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందని తెలిపారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్సై పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మహాలక్ష్మణుడు మాట్లాడుతూ రౌడీషీటర్‌లు నేరప్రవృత్తి మానుకుని సమాజంలో సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిపై రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అల్లర్లు, గొడవల్లో తలదూర్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు నందిగామ జట్టు



విజయవాడలో జిల్లాస్థాయి పోటీల్లో తలపడుతున్న నందిగామ నియోజకవర్గ ఖోఖో జట్టు సభ్యులు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తారన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. అందుకు ఇటీవల విజయవాడలో ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల్లో నందిగామ నియోజవర్గానికి చెందిన చందర్లపాడు జట్టు ఖోఖోలో విశేషప్రతిభను కనబరిచి మొదటిబహుమతిని గెలుచుకోవడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడమే నిదర్శనం. ఈసందర్భంగా ఖోఖో పురుషుల విభాగం జిల్లాస్థాయి పోటీల్లో విశేష ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ ఆదివారం అభినందించారు. ఖోఖోలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా విజేతలుగా నిలవాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయిలో గెలవడమే లక్ష్యం..



జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాణించి ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం ఆనందంగా ఉంది. నిజంగా రాష్ట్రప్రభుత్వ ప్రోత్సాహం మరవలేనిది. నియోజకవర్గ, జిల్లాస్థాయిలో వరుసగా రూ.30వేలు, రూ.60వేలను నగదు బహుమతులుగా పొందాం. ఇదేస్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో కూడా గెలుపొందడమే లక్ష్యంగా ఆడుతాం.

– కె వేణు, జట్టు కెప్టెన్, చందర్లపాడు

యువతకు మేలు



ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడాపోటీలు నిర్వహించి శుభపరిణామం. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయి. నిత్యం అనేక వ్యాపకాల్లో ఉండే యువత ఎంతో ఉత్సాహంగా ఆడి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఈ పోటీలకు యువతకు ఎంతోమేలు చేస్తాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా గెలిచేలా జట్టుకు శిక్షణ ఇస్తున్నా.

– కె.శ్రీనివాసరావు, కోచ్, చందర్లపాడు

సండే @ స్మృతివనం



నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో సందడి నెలకొంది. ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో స్మృతివనం ప్రాంగణమంతా కిటకిటలాడింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, వివిధ ఆకృతులను సందర్శకులు తిలకించారు. సాయంత్రం లైటింగ్ వెలుతురులో స్మృతివనం విశేషంగా ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





గుడ్ విషెష్‌తో మనో ధైర్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, రెడ్ ఎఫ్‌ఎం ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని పీవీపీ మాల్‌లో ది పవర్ ఆఫ్ గుడ్ విషెస్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత రెడ్ ఎఫ్‌ఎం ఆర్‌జేలు ఇస్మార్ట్ స్వీటీ, అన్యలు మాల్‌కు వచ్చిన వారి దగ్గర నుంచి గుడ్ విషెస్ తీసుకుని ఎఫ్‌ఎంలో ప్రసారం చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిపుణులు డాక్టర్ వీఎస్ఎన్ రావు మాట్లాడుతూ.. ప్రేమతో మీరు బాగుండాలని అని చెప్పే మాటలు ఎంతో మనోధైర్యాన్నిస్తాయని చెప్పారు. డాక్టర్ కె.రంగనాథ్, టి.యువకిషోర్, రెడ్ ఎఫ్‌ఎం స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్‌బాషా పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తనిఖీ

కంచికచర్ల : రాష్ట్ర ప్రభుత్వం జగనన్న లేఅవుట్లలో పేదలకు కేటాయించిన ఇళ్లస్థలాలను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని ఆర్డీఓ పి.సాయిబాబు ఆదేశించారు. మండలంలోని మోగులూరు, వేములపల్లి గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలోని ఇళ్లస్థలాలను ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ద్వారా పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. ఆయా స్థలాలపై లబ్ధిదారులకు సర్వహక్కులు లభిస్తాయని చెప్పారు. మోగులూరులో 197మందికి, వేములపల్లిలో 189మందికి, శౌరి అమరవరంలో 229మంది పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చినట్లు చెప్పారు. వీరికి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీ లేఅవుట్లలోని ఇళ్లస్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, మండల పరిషత్ కార్యాలయ సూపరిండింటెంట్ కె.బాలశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వనిత, వీఆర్వోలు శ్రీలక్ష్మి, ఎస్‌వీ రామారావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మోగులూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిబాబు

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి పేదలకు అందజేస్తున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఆర్డీఓ సాయిబాబు ఆదేశించారు. వీరులపాడు మండలంలోని కొణతాలపల్లి, వెల్లంకి, పొన్నవరం, బోడవాడ గ్రామ సచివాలయాల్లో సాగుతున్న పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు.

ఈసందర్భంగా ఆర్డీఓ సాయిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలందరికి ఇళ్లస్థలాలను అందించి సొంతింటి కలను సాకారం చేస్తున్నారని, అధికారులు కూడా అందుకనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్‌లు షోడగిరి రాజశ్రీ, నంద్రు సౌజన్య, హుసేన్‌బి, శీలం సంధ్య, వీఆర్వో మాధవరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఆపలేరు : ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడమే తన లక్ష్యమని, అందుకు ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధిలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్పష్టం చేశారు. స్థానిక ఊరచెరువు సుందరీకరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. సైడ్ గ్రిల్స్, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనుల పురోగతిపై కంట్రాక్టర్లను అడిగితెలుసుకున్నారు. పనుల విషయంలో రాజీ పడవద్దని నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వారికి సూచించారు. అనంతరం విప్ ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధిజరుగుతున్నప్పటికి టీడీపీ వారు ఓర్చుకోలేకపోతున్నారన్నారు. తనకు మంచి పేరు వస్తుందని, కోర్టుల్లో కేసులు వేస్తూ పనుల నిలుపుదలకు స్టేలు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. షాదీఖానా, ఊరచెరువు, రోడ్లు, చివరికి పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను కూడా అడ్డుకుంటూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా తాను నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని ఆపలేరని స్పష్టం చేశారు. నిజాలను చూస్తున్న ప్రజలే టీడీపీ వారికి తగిన బుద్ధిచెబుతారని పేర్కొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నందిగామ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి నందిగామ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం నందిగామలో భిక్షాటన చేసుకునే గుర్తుతెలియని వ్యక్తి పట్టణంలోని రైతుపేటలో మృతి చెందాడు. మృతుడి వయస్సు 65 ఏళ్లు ఉంటుంది. అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసినట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు.